

ఉగాది పురస్కార కవితలకు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్వేమన కవితామయం (శ్రీకాకుళం), తపస్వీ మనోహరం (హైదరాబాద్) సంస్థల సంయుక్త ఆధ్వర్యాన మార్చి 23వ తేదీన శ్రీకాకుళం నగరంలో సాహితీ పురస్కార సభను నిర్వహిస్తున్నట్లు కవితామయం కార్యదర్శి మహ్మద్ రఫీ (ఈ-వేమన) ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని పురస్కార సభను నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు, కవయిత్రులు కవితా సంపుటిని రెండు ప్రతులు చొప్పున మహ్మద్ రఫీ (ఈవేమన), ఎస్-1 శారదా అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా, 532407 చిరునామాకు మార్చి 15వ తేదీ లోగా పంపాలని సూచించారు. వాటిలో ఎంపికైన మూడు పుస్తకాలకు రూ.రెండు వేల నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన రచయితలకు శాలువలతో సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. నగదు పురస్కారాలను కేంద్ర సాహిత్య అకాడమీ బాలల పురస్కార విజేత పార్వతీపురానికి చెందిన ఎస్.ఉమామహేశ్వరరావు అందించనున్నట్లు పేర్కొన్నారు.



మార్టిగేజ్ మెలిక

కిసాన్ క్రెడిట్ కార్డుల (కెసిసి) ద్వారా అందిస్తున్న రుణ సాయాన్ని పెంచుతున్నట్లుగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కంటే బ్యాంకుల్లో వడ్డీ తక్కువగా ఉండడంతో కొంత భారం తగ్గుతుందని రైతులు భావించారు. తీరా చూస్తే, పంట రుణాలకు మార్టిగేజ్ చేయాలని మెలిక పెట్టినట్టు తెలుస్తోంది. దీంతో రైతులు అవాక్కవుతున్నారు. మార్టిగేజ్‌కు రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో అదనంగా భారం పడే అవకాశం ఉండడంతో, రుణ పరిమితి పెంచి తమకేం లాభమని పెదవివిరుస్తున్నారు. మరోవైపు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం, బ్యాంకర్లు సిద్ధమవుతున్నారు.

- కెసిసి రుణాలకు భూముల తనఖా షరతు
- రిజిస్ట్రేషన్ ఫీజు రూపంలో అన్నదాతలపై అదనపు భారం
- రుణ పరిమితి పెంచి ఏం ప్రయోజనమంటూ పెదవివిరుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు 6.20 లక్షల ఎకరాల్లో పలురకాల వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి. వీటితో పాటు లక్ష ఎకరాల్లో కొబ్బరి, జీడి, మామిడి, తదితర పంటలు సాగువుతున్నాయి. 249 ఎకరాల్లో పట్టు సాగవుతోంది. పంట రుణాల కింద ప్రభుత్వం వరికి ఎకరాకు రూ.40 వేలు, మొక్కజొన్నకు రూ.30 వేలు, కూరగాయలకు రూ.40 వేలు, మామిడి, ఇతర పూల తోటలకు రూ.30 వేల వరకు పెట్టుబడి ఖర్చులు అవసరమవుతాయి. ప్రైవేట్ వ్యాపారుల వద్ద వడ్డీ ఎక్కువగా ఉండడంతో, రైతులు బ్యాంకు నుంచి రుణాలు తీసుకోవడానికే ప్రాధాన్యమిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.8,343.91 కోట్లను రైతులకు రుణాలుగా అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ ఏడాది జనవరి 31వ తేదీ నాటికి రూ.7,509.52 కోట్లను పంపిణీ చేశారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.5,246.55 కోట్లను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు రూ.5,565.21 కోట్లను అందించారు.

మార్టిగేజ్‌తో అదనపు భారం

కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.ఐదు లక్షల వరకు రుణం పొందాలంటే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి భూములను మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. మార్టిగేజ్ చేయాలంటే రైతులు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. సాధారణంగా రుణం తీసుకున్న సొమ్ములో 0.5 శాతం మార్టిగేజ్ చేస్తారు. దీనిపై స్టాంప్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అప్పు కోసం అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు తలెత్తనున్నాయి. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా అందించే రుణాలకు గతేడాది డిసెంబర్ 31వ తేదీ వరకు రూ.1.60 లక్షల వరకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేసేవారు. ఆ తర్వాత జనవరి ఒకటో తేదీ నుంచి దాన్ని రూ.రెండు లక్షలకు పెంచారు. రూ.మూడు లక్షల రుణం వరకు పావలా వడ్డీ వసూలు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో దాన్ని రూ.ఐదు లక్షల వరకు పెంచడంతో ఆ మొత్తం వరకు పావలా వడ్డీ వసూలు చేయనున్నారు.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా అందించే రుణాలకు భూముల మార్టిగేజ్‌పై ఆర్‌బిఐ నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి పెంపు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు కానుంది. రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం రాదు.

- హరిప్రసాద్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్



మందస : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

విద్యారంగ సమస్యల పరిష్కారానికి

విజయగౌరిని గెలిపించాలి

మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - పలాస, మందస

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నికరంగా, నిజాయితీగా పోరాడే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ పిలుపునిచ్చారు. పలాస, మందస మండలాల్లోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులతో బుధవారం చర్చాగోష్టి నిర్వహించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా 32 వేల ఉపాధ్యాయ పోస్టులు, 12,247 పాఠశాలలు తగ్గిపోయాయని తెలిపారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ పోస్టులను తగ్గిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్ విద్యారంగంపై ప్రభుత్వ తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాటం ఫలితంగానే కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెరిగాయని గుర్తు చేశారు. మరోవైపు ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు లేవని, వారి హక్కులను పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు సామాజిక భద్రత అవసరమన్నారు. అందుకోసం పిడిఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేస్తున్నారని వివరించారు. విద్యారంగ సమస్యలు, కాంట్రాక్టు అధ్యాపకుల జీతభత్యాలు, ఉద్యోగుల హక్కులపై నికరంగా పోరాడుతోందని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరూ ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి సొంత ప్రయోజనాల కోసమే పనిచేశారని విమర్శించారు. విజయగౌరి తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచారని చెప్పారు. రాజకీయ పార్టీల తరుపున గెలిచే వ్యక్తులను శాసనమండలికి పంపితే వారిపై ఆయా పార్టీల పెత్తనం ఉండడంతో, వారు సమస్యలపై మాట్లాడే అవకాశం ఉండదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయగౌరిని గెలిపిస్తే ఆమె స్వతంత్రంగా వ్యవహరించి సమస్యలపై పోరాడతారని చెప్పారు. విజయగౌరికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలికి పంపిస్తే, ఆమె ఉపాధ్యాయుల గొంతుకవుతారని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శులు జి.రమేష్, కంచరాన రమేష్, తదితరులు ఉన్నారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - మందస



మండలంలోని లహరిబంద యశోద నగర్ కాలనీకి చెందిన పదో తరగతి చదువుతున్న కర్రి అనూష (14) బుధవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... అనూష అదే గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఎప్పటిలానే పాఠశాలకు వెళ్లిన అనూష మధ్యాహ్నం ఇంటర్వెల్ సమయంలో పాఠశాల నుంచి బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవడంతో వ్యాయామ ఉపాధ్యాయుడు అదే పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న అనూష చెల్లెలు మేఘనను తీసుకుని వారి ఇంటికి వెళ్లారు. అక్కడ లేకపోవడంతో వెతికేసరికి గ్రామ సమీపంలోని జీడి చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా వేలాడి ఉంది. అనూష తండ్రి రామ్మూర్తి ఉపాధి నిమిత్తం విదేశాల్లో ఉండగా, తల్లి శ్రీదేవి స్థానికంగా కూలి పనులు చేస్తుంది. ఉపాధి హామీ పనికి వెళ్లిన శ్రీదేవి కుమార్తె మరణవార్త విని భోరున విలపించింది. అనూష ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

విధుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- పల్లె పండగ పనుల్లో వేగం పెంచాలి
- సచివాలయ ఉద్యోగుల హాజరు 70 శాతం ఉండాలి
- లేకుంటే ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విధి నిర్వహణలో అలసత్వాన్ని వీడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. 'పల్లె పండగ'లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టరేట్ నుంచి ఎంపిడిఒలు, తహశీల్దార్లు, పంచాయతీరాజ్, డ్వామా అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా మంజూరైన, పూర్తయిన పనులు, బిల్లుల మంజూరు, పెండింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పల్లె పండగ కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటినీ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన రహదారులు, కల్వర్టులు, డ్రైనేజీ నిర్మాణ పనులు శత శాతం పూర్తి చేసి బిల్లులు వెంటనే పంపించాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగియక ముందే ఈ పనులన్నీ పూర్తి కావాలని ఆదేశించారు.

అలసత్వాన్ని వీడాలి

పంచాయతీ రాజ్ అధికారులకు నిర్దేశించిన వారం పనుల ప్రగతిలో పూర్తిగా వెనుకబడిన కొత్తూరు, వజ్రపుకొత్తూరు, టెక్కలి మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చేపడుతున్న పనుల సమాచారాన్ని రోజువారీ నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలని సూచించారు. సొంత భవనాలు ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, తాగునీటి వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తున్నారని పాతపట్నం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో 60 శాతం పనులు మాత్రమే పూర్తి కావడంపై అసహనం వ్యక్తం చేశారు. రూ.50 లక్షలకు పైగా బిల్లులు ఎందుకు అప్‌లోడ్ చేయలేకపోతున్నారని ఎస్ఇని ప్రశ్నించారు. కొత్తూరులో 18 అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యానికి గల కారణాలను తెలుసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల హాజరు 70 శాతం ఉండాలి

ఎచ్చెర్ల మండలంలో సచివాలయ ఉద్యోగుల హాజరు 46 శాతం మాత్రమే ఉండడాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇకపై ఏ మండలంలోనైనా సచివాలయ ఉద్యోగుల హాజరు 70 శాతం కంటే తక్కువ ఉంటే ఆయా ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిపిఒ భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కె.త్రినాథస్వామి, డిఎంహెచ్ఒ బాల మురళీకృష్ణ, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరులో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

విజయగౌరి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కొత్తూరు, సీతంపేట

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి కొత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో బుధవారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఆ మండలాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 33 ఏళ్లుగా నిజాయితీ, నిబద్ధతతో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడం, 12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించడం, ఆర్థిక బకాయిలు చెల్లింపు, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులను రెగ్యులర్ చేయడం, తదితర డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో జిఒ 114 అమలుకు పనిచేస్తానన్నారు. కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయడానికి, రెగ్యులర్ చేయడానికి తనవంతు ప్రయత్నిస్తానని తెలిపారు. జిఒ 3 పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల గొంతును శాసనమండలిలో వినిపించేందుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎ.భాస్కరరావు, డి.ప్రకాశరావు, కె.కృష్ణారావు, ఈగల తిరుపతిరావు, పి.కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్ టి.రాజకుమారి, విశాలాక్షి, సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి రెండో వారంలో చలో విశాఖ డెయిరీ

రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలని, ఆవు పాలు కనీస వెన్న శాతాన్ని 2.8 శాతం నుంచి 3.1 శాతానికి పెంపు, 30 లీటర్ల కంటే తక్కువ పాలు పోసిన సెంటర్లలో పాల సేకరణ నిలిపివేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మార్చి రెండో వారంలో చలో విశాఖ డెయిరీని చేపడుతున్నట్లు ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని రైతుసంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పాల రైతుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు చెల్లిస్తున్న పాల ధరను తగ్గించి అన్యాయం చేస్తున్నారని, తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలని డిమాండ్ చేశారు. పాల రైతులకు ఆపిన బోనస్‌ను వెంటనే చెల్లించాలన్నారు. పాల సేకరణ ధరకు మార్కెట్‌లో అమ్మకపు ధరకు ఉన్న వ్యత్యాసం కంటే అదనంగా రూ.10 చెల్లించాలని కోరారు. బోనస్ నాలుగు నెలలకోసారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సహకార రంగంలో పాలు పోసిన రైతులకు లీటరుకు రూ.ఐదు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. డెయిరీ అక్రమాలపై హౌస్ కమిటీ విచారణను పూర్తి చేసి దోషులను శిక్షించి డెయిరీ ఆస్తులు, రైతులను కాపాడాలన్నారు. మార్చి రెండో వారంలో చలో విశాఖ డెయిరీ కార్యక్రమానికి వేలాది మంది రైతులను సమీకరించి పోరాడి యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని తీర్మానించారు. సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, బగాది వాసుదేవరావు, అల్లు సూర్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యనారాయణ

జగన్ పర్యటనను విజయవంతం చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్



ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇటీవల మృతి చెందిన వైసిపి సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈనెల 20వ తేదీన పాలకొండకు వస్తున్న వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈమేరకు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. 20న తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు పాలకొండ చేరుకుంటారని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - కొత్తూరు

రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి రెవెన్యూ అధికారులకు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలు, సర్వేయర్లతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే భూమికి రెండు ఖాతా నంబర్లు ఉంటే ఆ భూమికి సంబంధం లేని రైతు నుంచి ఎన్‌ఒసి తీసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో డాక్యుమెంట్లను సక్రమంగా పరిశీలించాలన్నారు. రైతుల భూములను ఆధార్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. మ్యుటేషన్లు వేగవంతం చేయాలన్నారు. పాస్ పుస్తకం, అడంగల్‌లో ఇంటి పేర్లు తప్పులను సరిచేయాలన్నారు. జాయింట్ ఎల్‌పి నంబర్ల సమస్య ఉన్న చోట ఇరు రైతులకు నోటీసులు ఇచ్చి సహకరించాలని కోరాలని, సహకరించకపోతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ రవిచంద్ర, డిటి సిహెచ్.భీమారావు, ఆర్‌ఎస్ డిటి గురవయ్య, ఆర్‌ఐ లక్ష్మణ్‌కుమార్, విఆర్‌ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

త్వరితగతిన నూతన కలెక్టరేట్ నిర్మాణం

శ్రీకాకుళం అర్బన్: సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నూతన కలెక్టరేట్ ఆవరణలో చేపడుతున్న పార్కింగ్, సెక్యూరిటీ, ప్రహరీ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. భవనంలోని అంతర్భాగంతో పాటు పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. అంతర్గతంగా నిర్మిస్తున్న రోడ్డు డివైడర్ పనులు పరిశీలించిన ఆయన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కలెక్టరేట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, కాంట్రాక్టరు ప్రతినిధులు ఉన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకటేశ్వరరావు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు మొదటి దశ శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా అనుసరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో నియమాలు, నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలన్నారు. శిక్షణలో కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ, సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, పలువురు బ్యాంకు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



విప్ అశోక్‌కు సమస్యలను వివరిస్తున్న రాజు

విప్ దృష్టికి గల్ఫ్ బాధితుల సమస్య

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రెండు రోజులుగా నలుగుతున్న గల్ఫ్ బాధితుల సమస్యను ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ దృష్టికి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విప్‌ను బుధవారం కలిసి వివరించారు. గల్ఫ్ దేశాలకు పంపిస్తామని చెప్పి మోసపోయిన బాధితులు 60 మంది జనసేన పార్టీ కార్యాలయానికి కలిశారన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు 350 మంది బాధితుల వద్ద నుంచి రూ.3.4 కోట్ల వరకు ఏజెన్సీలు వసూలు చేశారని అన్నారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఇందులో ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస మండలాలకు చెందిన వారు ఉన్నారని అన్నారు. విప్ స్పందించి ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వివరించారు. బాధితులకు తగు న్యాయం చేయాలని అన్నారు. తగునాయ్యం చేయాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

22ఎ జాబితా నుంచి తొలగించాలి

సోంపేట : తమ వ్యక్తిగత ఆస్తులు గ్రామకంఠం 22ఎ జాబితాలో తప్పుగా నమోదు చేశారని, దీనివల్ల తమ ఆస్తుల క్రయవిక్రయాలకు ఇబ్బందులు పడుతున్నామని సోంపేట పట్టణానికి చెందిన పలువురు తెలిపారు. ఈ మేరకు పంచాయతీ ఇఒ శాంతికుమారి, ఎంపిడిఒలను బుధవారం కలిసి వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. పట్టణంలోని జలంత్ర, మండలంలోని మహదేవిపేట, సూర్యనారవీధి, పట్టుశాలి వీధి, జలంత్ర జాలారి వీధిల్లో పలువురి వ్యక్తిగత ఆస్తులు గ్రామకంఠం 22ఎ జాబితాలో తప్పుగా నమోదైందన్నారు. దీనివల్ల క్రయవిక్రయాలు చేసేందుకు వీలులేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

విలువలతో కూడిన విద్య అభ్యసిస్తూ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్‌విజె విద్యా సంస్థల కరస్పాండెంట్ బెందాళం కింగ్ విద్యార్థులకు సూచించారు. ఎస్‌విజె డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఒత్తిడితో కూడిన విద్య కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో చదువు సాగించాలని సూచించారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో ఉంటారని, వారి ఆశలను ఒత్తిడితో కాకుండా ఓర్పుతో నిజం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బి.ఝాన్సీ, ఎస్.విశ్వనాథం, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, పి.సత్యం, సిహెచ్.జోష్ పాల్గొన్నారు.

పాఠశాలను విలీనం చేయొద్దు

ప్రజాశక్తి- కంచిలి

తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సమీపంలోని ఎం.ఎస్.పల్లి ఉన్నత పాఠశాలలో విలీనం చేయొద్దంటూ కర్తలికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులు స్థానిక ఎంఆర్ భవనం వద్ద బుధవారం ఆందోళన చేశారు. అనంతరం డిమాండ్లతో కూడలిన వినతిపత్రాన్ని ఎంఇఒ ఎస్.శివరాంప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కర్తలి ప్రాథమిక పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థులను స్కూల్ మెర్జింగ్ విధానం పేరిట ఎం.ఎస్.పల్లి ఉన్నత పాఠశాలకు తరలించడంతో తమ పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి చిన్నపిల్లలు అంతదూరం వెళ్లి నిత్యం రాకపోకలు సాగించడం సాధ్యం కాదన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. అధికారులు సమస్యను పరిశీలించి, విలీన ప్రక్రియను రద్దు చేయాలని కోరారు.



ఆందోళన చేస్తున్న కర్తలి గ్రామస్తులు

నిలిచిన రాగి సాగు

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంపై మహిళా రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు సరఫరా చేయాల్సిన రాగి పంట విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో నిలిచిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పురపాలక సంఘం పరిధిలోని 3వ వార్డులోని ఊసవానిపేటకు చెందిన జి.అప్పలనూరమ్మ, జి.కోటమ్మ అనే ఇద్దరు మహిళా రైతులు తమకు ఉన్న ఐదెకరాల భూమిలో వరి, రాగి సాగు చేస్తూ ప్రతి ఏడాది ఎపి సీడ్స్‌కు పండించిన పంటను అందిస్తారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా రాగి పంట సాగుచేసేని ఎపి సీడ్స్‌కు ఇవ్వటానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే వీరి పొలంలో ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటార్లకు అందించాల్సిన విద్యుత్‌ను సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు అందించకుండా గత నెల రోజుల నుంచి ఇబ్బందులకు గురి చేయడంతో ఈ ఏడాది రాగి పంట వేయలేకపోయామని మహిళా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎపి సీడ్స్ అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత ఎపి సీడ్స్ అధికారులు తమకు విత్తనాలు సరఫరా చేశారని తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో తమ భూములు ఉన్నాయని అయితే ఆమదాలవలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తమ పంట పొలాలు ఉన్నప్పటికీ గతంలో విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగి మోటార్ల ద్వారా సాగునీరు అందడంతో పంటకు అనుకూలంగా ఉండేదని రైతులు చెబుతున్నారు. ఆమదాలవలస విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ చేతివాటంతో కొన్ని వ్యవసాయ విద్యుత్ కనక్షన్లకు విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బందికి ఆదేశిలిస్తూ తమ విద్యుత్ మోటార్లకు విద్యుత్ సరఫరా కాకుండా ప్రతిరోజు నిలుపుదల చేస్తున్నారని మహిళా రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై శ్రీకాకుళం విద్యుత్‌శాఖ ఎఇని ప్రశ్నించగా సబ్‌స్టేషన్ ఆమదాలవలస పరిధిలో ఉందని అక్కడ ఎఇ ఆదేశాలతో విద్యుత్ సరఫరా కావడం లేదని తెలిపారని రైతులు చెబుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారుల వింత పోకడల కారణంగా ఎపి సీడ్స్‌తో ఈ ఏడాది ఒప్పందం చేసుకున్నప్పటికీ రాగిపంట విత్తనాలు అందించలేకపోతున్నామని మహిళా రైతులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరా చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని వారు వాపోయారు. నిర్లక్ష్యపు విద్యుత్‌శాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని మహిళా రైతులు ముక్త కంఠంతో కోరుతున్నారు.



విద్యుత్ సరఫరా లేక ఎండుతున్న పంట పొలం

అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ



ఆమదాలవలస : శిక్షణలో మాట్లాడుతున్న ఎంఇఒ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి- ఆమదాలవలస

అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రేమతో విద్యాబోధనను అందించాలని మండల విద్యాశాఖాధికారి జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ పిఒ అనురాధ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుల్లో భాగంగా ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఎంఇఒ పాల్గొని అంగన్వాడీలకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ శిక్షణలో భాగంగా సమగ్ర అభివృద్ధి, శారీరక అభివృద్ధి, భాషా అభివృద్ధి, మేధాభివృద్ధి, సామాజిక అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. సృజనాత్మక వంటి అంశాలపై అవగాహన కృత్యాలు ప్రదర్శన విషయాలను ప్రాక్టికల్‌గా వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌పి శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భోజనంపై అంగన్వాడీల అసహనం

శిక్షణలో భాగంగా ప్రతిరోజు మధ్యాహ్నం అందిస్తున్న భోజనంపై అంగన్వాడీలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు ఒకపూట భోజనానికి, సాయంత్రం, ఉదయం అందించే స్నాక్స్‌కు రూ.200 మంజూరు చేసి నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ సంబంధిత అధికారులు నాసిరకం భోజనాన్ని అందిస్తున్నారని అంగన్వాడీలు వాపోతున్నారు. మంగళవారం మొదటి రోజు శిక్షణలో ఉడకని వంకాయ కూర, నాసిరకం బియ్యంతో ఆహారాన్ని వడ్డించడంతో తాము తినలేకపోయామని పలువురు వాపోయారు. రెండోరోజు కూడా గుడ్లుతో భోజనాన్ని అందించారని, ఒకవైపు బర్డ్‌ఫ్లూ ప్రచారం జరుగుతుందని దాంతో తాము ఆందోళన చెందామని పలువురు తెలిపారు. ఆహారంలో నాణ్యత, రుచి కొరవడుతుందని పలువురు అంగన్వాడీలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు మంచి ఆహారాన్ని అందించాలని అంగన్వాడీలు కోరుతున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పొందూరు: జ్ఞానజ్యోతి శిక్షణను అంగన్వాడీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-1, 2 శ్రీరాములు, రాజారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జ్ఞానజ్యోతిపై సిడిపిఒ అనురాధ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్ఞాన జ్యోతి ద్వారా 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి రెండోరోజు చిన్నారుల సమగ్రాభివృద్ధికి సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వెంకటరావు, సూపర్‌వైజర్ జి.వి.రత్నం, సిఆర్‌పిలు సత్యనారాయణ, శ్రీనివాసరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు : శిక్షణలో మాట్లాడుతున్న ఎంఇఒ శ్రీరాములు

కంచిలి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి పేరిట అంగన్వాడీ కార్యకర్తలకు ఎంఇఒ శివరాంప్రసాద్ శిక్షణ ఇచ్చారు. మనోవికాస నిపుణుడు రామ్ బుడ్డి గణపతి, మాస్టర్ ట్రెయినీలు వై.శంకరరావు, ఎస్.గోపి, భాస్కరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో వై.ఎస్.నాయుడు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

పలాస: జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నాలుగు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా... జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని అన్నారు. అలాగే ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛ వంశధార కాలువ మండలంలోని యాపోడు చెరువుకు అనుసంధానం చేస్తూ... ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని విన్నవించారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జి.చలపతి, మద్దెల ధర్మారావు, తామాడ త్రిలోచనరావు, బొడ్డు సింహాద్రి, బత్తిన వాసు, రామారావు, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, గురుదాసుపురం సర్పంచ్ కుత్తుము లక్ష్మణరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

ప్రజావసరాలు తీర్చే బడ్జెట్

శ్రీకాకుళం అర్బన్: పేద, మధ్య తరగతి వర్గాల ప్రయోజనాలు, దేశ ఆర్థిక పురోగతి కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత కలిగి ఉండాలని పలువురు మేధావులు అభిప్రాయ పడ్డారు. బుధవారం నగరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కేంద్ర బడ్జెట్‌పై బిజెపి ఆధ్వర్యాన మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా అధ్యక్షులు సిరిపురపు తేజేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో విశాఖ నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుతో పాటు నగరానికి చెందిన వైద్య నిపుణులు డా.కింజరాపు అమ్మన్నాయుడు, చార్టర్డ్ అకౌంటెంట్ ఐ.కె.రావు, విశ్రాంత జడ్జి పప్పల జగన్నాథం, అంబేద్కర్ యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ తులసీరావు, కంపెనీ సెక్రటరీ బుర్రా భార్గవ్, విద్యావేత్త నిక్కు అప్పన్న, జర్నలిస్టు కొంక్యాన వేణుగోపాల్, జామి భీమ శంకర్, డా.పైడి సింధూర,తిరుపతిరావు, పైడి వేణుగోపాలం పాల్గొన్నారు.

మార్గదర్శకాలు తప్పనిసరి

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా బోర్లు తవ్వకాలు చేపట్టేవారు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు ఒక ప్రకటనలో సూచించారు. భూగర్భ జలాలు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలో తగ్గుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికే బోరుబావి తవ్వేందుకు కొన్ని మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. భూగర్భజల సర్వే నిమిత్తం ఇంటి యజమాని మున్సిపల్ కార్యాలయానికి సంప్రదించి చలానా చెల్లించా లన్నారు. చలానాతో పాటుగా ఫారం-2లో కొత్త బావి తవ్వడానికి దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుతో పాటు కొత్తగా తవ్వబోయే బోరు బావికి, సమీప దూరంలోని బోరుబావుల వివరాలను తెలిపే ఫీల్డ్ స్కెచ్, ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన ధ్రువపత్రం జత చేయాలన్నారు. ఈ దరఖాస్తుపై స్థానిక మున్సిపల్ కమిషనర్ కౌంటర్ సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు.

నేడు పరశురాం పాత్రో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- అరసవల్లి

ఆధునిక సమాజంలో సంస్కరణలకు ఆద్యుడుగా పేరొందిన రావు సర్ బహదూర్ అన్నెపు పరుశురాం పాత్రో జీవితచరిత్రను ఉత్తరాంధ్రా, ఒడిశా ప్రాంత ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల 20న పుస్తకావిష్కరణ చేస్తున్నట్టు పుస్తకావిష్కరణ ఆహ్వాన కమిటీ ప్రతినిధి బుడుమూరు శ్రీరామ్మూర్తి విలేకరులతో మాట్లాడారు. గురువారం కొత్తరోడ్డులోని శాంతి కన్వెన్సన్‌లో కళింగ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో పిఎ పాత్రో పుస్తకాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆవిష్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని సుమారు మూడున్నరేళ్ల పరిశోధన చేసి భవిష్యత్ తరాల కోసం పాత్రో జీవిత చరిత్రను అందజేయడానికి వీర గున్నమ్మ సినీ దర్శకులు, నిర్మాత, రచయిత గూన అప్పారావు రచించినట్టు తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు 1923లో మద్రాస్ ప్రెసిడెన్సీలో విద్యాశాఖ మంత్రిగా పరుశురాం పాత్రో ఉంటూ విశాఖలో ఆంధ్రా యూనివర్శిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా మద్రాస్ ప్రెసిడెన్సీలో బిల్లు పెట్టి రిజర్వేషన్లు అమలు చేసింది పరశురాం పాత్రోనని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చి ముత్తులక్ష్మీరెడ్డిని పోటీ చేయించి మొదటి మహిళా ప్రజాప్రతినిధిగా పరశురాం పాత్రో గెలిపించారని తెలిపారు. గూన అప్పారావు చారిత్రాత్మకమైన అంశాలు వెలుగు తీయడంలోనూ అధ్యయనం చేయడంలోనూ భావితరాలకు అందించడంలోనూ మంచి కృషి చేశారన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మేధావులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



ఇచ్ఛాపురం : చిత్రపటానికి పూలమాల వేస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంఘ సంస్కర్తగా ఛత్రపతి శివాజీ భారతీయుల గుండెల్లో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నారని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం నగరంలోని గాంధీ మందిరంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుడన్నారు. వావిలపల్లి జగన్నాథం నాయుడు, సిరిపురం తేజేశ్వరరావు, పైడి హరినాధరావు, నిస్థల నరసింహమూర్తి, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పైడి వేణుగోపాలం, బిర్లంగి ఉమామహేశ్వరరావు, జామి భీమశంకర్, కొంక్యాన వేణుగోపాల్, ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : శాంతినికేతన్ హైస్కూల్‌లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు పద్మజ, శాంతి, సునీత ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ జిహారిక, జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.పి.ఎల్.జోత్స్న పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న ప్రతినిధులు

కవిటి: ధైర్యానికి ప్రతిరూపం ఛత్రపతి శివాజీ అని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ఎఒ రాణి అన్నారు. పాఠశాల ఆవరణలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ప్రిన్సిపాల్ బిందు మాధవి ఆధ్వర్యాన నిర్వహించారు. అలాగే ప్రముఖ సంఘ సేవకులు స్వతంత్ర పోరాట యోధుడు గోపాలకృష్ణ గోకులే వర్ధంతిని,శాస్త్రవేత్త నికోలస్ కోపర్నికస్ జయంతిని పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుర్తు తెలియని మృతదేహం

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని హయాతినగరం సమీపాన నాగావళి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో కుళ్లిన అస్తి పంజరం, దుస్తులు మాత్రమే మిగిలి ఉన్నాయి. మృతుని వయసు సుమారు 35 నుంచి 40 ఏళ్ల ఉంటుందని అంచనా వేస్తున్నారు. మృతదేహం ఎడమచేతిపై మహిళ బొమ్మ, అక్షరాలు పచ్చబొట్టు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. స్థానిక వీఆర్‌ఓ సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. స్థానికంగా అదృశ్యమైన కేసుల నమోదు ఆధారంగా ఎవరన్నది పరిశీలిస్తున్నారు.



దగ్ధమైన కిరాణా సామగ్రి, కాలిన నగదు చూపిస్తున్న బాధితుడు

కిరాణా షాపు దగ్ధం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని తేలుకుంచిలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో గుడియా భీయో కిరాణా షాపు, రూ.3 లక్షల నగదు అగ్నికి ఆహుతైంది. వివరాల్లోకి వెళ్తే... ఉదయం షార్ట్‌సర్క్యూట్ కారణంతో ఒక్కసారిగా షాపులో నుంచి మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక అధికారి అర్. సూర్యారావు, సిబ్బంది కాశీనాథ్, డి.ప్రసాద్, ఎస్.పి. వెంకటరావులు శకటంతో వచ్చి మంటలను అదుపు చేసి ఆస్తినష్టం అంచనా వేశారు. ఈ ప్రమాదంలో రూ.6 లక్షల వరకు ఆస్తినష్ట ఉంటుందని బాధితుడు రోదిస్తున్నారు. నగదు రూ.3 లక్షలు, ఇంటి, విద్యుత్ సామగ్రి, షాపు ధ్రువపత్రం, కిరణా సామగ్రి, విద్యుత్ మీటరు కాలిపోయాయి. బాధితుడిని సర్పంచ్ పి. రాజశేఖరరెడ్డి పరామర్శించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పాపారావు నేత్రాలు సజీవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



పాపారావు (ఫైల్)

శ్రీకాకుళం మండలం శ్యాంపాలెంకు చెందిన ఎల్. పాపారావు (58) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ సభ్యులకు సమాచారం అందించడంతో సిబ్బంది హాజరై కార్నియాలు సేకరించి ఎల్.వి.ప్రసాద్ ఆస్పత్రికి పంపించారు.

సూర్యతేజ డిగ్రీ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- పలాస

పలాసలోని సూర్యతేజ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి పి.జగదీశ్ బెహరా ఇటీవల సూరపేట, తమిళనాడులో నిర్వహించిన నేషనల్ టెన్నికోట్ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుని తన ప్రతిభను చాటారు. ఈ విజయం సాధించినందుకు కళాశాల ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ పద్మాజీ, కామేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. మున్ముందు మరిన్ని విజయాలు కలగాలని కోరుకుంటూ విద్యార్థిని అభినందించారు. డిగ్రీ స్థాయిలో క్రీడలను ప్రోత్సాహిస్తున్నామని అన్నారు

వంటశాలకు వితరణ

ప్రజాశక్తి- కొత్తూరు

1992లో కొత్తూరు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ సందర్భంగా వితరణ అందజేశారు. తమ వంతుగా మధ్యాహ్న భోజన శాలకు రూ.లక్ష వితరణగా ఇచ్చారు. అదనంగా అదే బ్యాచ్‌కి చెందిన గుడ్ల శ్రీధర్ ఏరో నాటికల్ ఇంజినీర్ రూ.50 వేలు ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఐఆర్‌ఎస్ సత్యనారాయణరాజు, గల్లావెల్లి శ్రీనివాసరావు ఆర్థికసాయం అందించేందుకు సిద్ధమయ్యారు. దాతలకు ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



నగదును అందజేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు

అధికారుల సమన్వయ లోపం

- గ్రామస్తులకు శాపం
- కూలబోతున్న మరుగుదొడ్లు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

అధికారుల సమన్వయ లోపం కారణంగా ఆ గ్రామస్తులకు శాపంగా మారింది. మండలంలోని తోటవాడ గ్రామంలో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గత ప్రభుత్వం సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా రూ. 4 లక్షల 50 వేల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టింది. ప్రారంభోత్సవం చేసుకోవడంతో ప్రజలు వినియోగించుకునేవారు. అయితే ఈ భవనం పక్కనే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం పనులను ప్రారంభించారు. చెరువుకు ఆనుకొని ఉన్న ఈ స్థలంలో సోమవారం తీసిన గోతులకు గోతుల్లో ఊట నీరు చేరడంతో మరుగుదొడ్ల మెట్లు కూలిపోయాయని గ్రామస్తులు తెలిపారు. ఇలాగే గోతులు తీస్తే భవనం కూడా పడిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవగాహన లోపంతో నిర్లక్ష్యంగా ఈ పనులు చేపట్టడం వలన ప్రభుత్వ ధనం లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన భవనం కూలిపోయే పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు వాపోతున్నారు.

ముఖ్యంగా ఈ స్థలం కోనేరుకు చెందిన స్థలమని, పూర్తిస్థాయిలో అధికారులు పరిశీలన జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చైతన్యను వివరణ కోరగా సింగారెడ్డి చెరువును ఆనుకుని ఉన్న స్థలంలో పనులు చేపట్టడం జరిగిందని, అయితే తవ్వకాల్లో సామాజిక మరుగుదొడ్ల భవనం డ్యామేజ్ జరిగిన మాట వాస్తవమన్నారు. ప్రస్తుతానికి పనులు నిలిపి వేయడం జరిగిందని, ఈ స్థలం ప్రభుత్వానిదా లేదా చెరువు గర్భమా అన్నది రెవెన్యూ శాఖకు నివేదిక పంపడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారుల నుంచి పూర్తిస్థాయిలో వివరణ వచ్చిన తర్వాత పనులు చేపడతామన్నారు. ఒకవేళ ఈ స్థలం చెరువు గర్భమే అయితే పనులు నిలిపి వేయడమే కాకుండా డ్యామేజ్ అయిన భవనానికి మరమ్మతులు కూడా చేపడతామని తెలిపారు.



కూలిన మెట్లు

అవస్థలు తప్పవు



ఈ భవనానికి ఆనుకొని వాటర్ ట్యాంక్ కోసం నిర్మాణం చేపడితే భవనం పడిపోయే పరిస్థితి ఉంది. దీంతో ప్రజలకు అవస్థలు తప్పవు.

- ఎస్ గోవిందరావు, తోటవాడ

ఉల్లి రైతు కంట కన్నీరు

- దిగుబడి తక్కువ
- పెట్టుబడులు అధికం
- పడిపోయిన ధర
- దోచేస్తున్న దళారులు



లావేరులో పండిన ఉల్లి పంట

ప్రజాశక్తి- లావేరు

ఉల్లి రైతులకు కంట కన్నీరు కారుతోంది. ఉల్లి చేసిన మేలు తల్లీ కూడా చేయదు అనేది నానుడి. అయితే లావేరు మండలంలోని ఉల్లి రైతులకు మాత్రం ఎప్పుడు ఉల్లి పంట సాగు చేసినా రైతులకు కంట కన్నీరు కారుతోంది. ఉల్లిపంట సాగు చేయడమంటే ఆషామాసికాదు. పెట్టుబడి అధికం. అదే విధంగా ఉల్లిపంట వేసిన రైతులు ఉల్లి నారు వేసిన దగ్గర నుంచి ఉడుపు, కోత వరకు చక్కగా చూసుకోవాలి. తెగుళ్ల బాధతో పాటు మంచుతో మరీ ప్రమాదం. ఇన్ని కష్టాలు, ఇబ్బందులు ఉండడం, బాగా పంట లేకపోవడం, పంట దిగుబడి ఉన్నా ధర లేకపోవడం వంటి సమస్యలు అధికం. గతంలో లావేరు మండలం ఉల్లిపంట సాగుకు, దిగుబడులకు జిల్లాలోనే ఆదర్శంగా ఉండేది. సుమారు మండల వ్యాప్తంగా 4 వేల ఎకరాల్లో ఉల్లిపంట రైతులు వేసేవారు. అందులో లావేరు పంచాయతీలోని లావేటిపాళెం, జిజివలస, కేశవరాయపురం, లావేరులోనే 2 వేల ఎకరాల్లో ఉల్లి సాగయ్యేది. లక్షల్లో అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ధరలేక, దిగుబడులు లేక తెగుళ్లతో తీవ్ర నష్టాలు చవిచూసిన రైతులు ఉల్లిపంటకు స్వస్తి చెప్పి సుమారు పదేళ్లు పైబడింది. మరలా ఈ ఏడాది ఉల్లి పంటపై మక్కువ చూపించిన కొంతమంది రైతులకు పాతరోజులు మాదిరిగానే ఫలితం కనిపిస్తుంది. లావేరు మండలంలో సుమారు 250 ఎకరాల్లో సాగుచేసిన రైతులకు మంచు, తెగుళ్ల తదితర ఇబ్బందులను తట్టుకొని వచ్చిన రైతులకు ధరలేక పోవడంతో నష్టాలు తప్పలేదు. ఒక్కో ఎకరానికి 70 కింట్వాలు నుంచి 100 కింట్వాలు వరకు దిగుబడులు వస్తున్నాయి. ధరమాత్రం లేక దళారీలు కింట్వాకు రూ.1300 నుంచి నుంచి 1500 మించి కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కో ఎకరానికి పంట సాగుకు నారు దగ్గర నుంచి ఉడుపు, కలుపులు, తెగుళ్ల నివారణకు మందులు, ఎరువులు, కోత మొదలగు దశలు వరకు ఎకరానికి రూ 50 నుంచి 60 వేలు వరకు పెట్టుబడి అవుతుంది. అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులకు లక్షల్లో అప్పులు మిగిలాయని కేశవరాయనిపురం, లావేటిపాళెం గ్రామాలకు చెందిన ఉల్లిపంట సాగు రైతులు యినపకుర్తి నాగరాజు, పళ్లింటి సూర్యారావు, లంకలపల్లి సత్యనారాయణ, యినపకుర్తి వెంకటరావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.30 నుంచి రూ.50 ధర పలుకుతున్నా తమ దగ్గర మాత్రం కిలో 15 మించు కొనడం లేదని, దళారులు వారి ఇష్టం వచ్చిన, నచ్చిన విధంగా రైతులను దోచెస్తున్నారని, తమ అప్పులు ఎలా తీర్చలో తెలియడం లేదని వాపోతున్నారు. వ్యవసాయం ఇక చెయ్యలేమని గగ్గోలు పెడుతున్నారు. ఆఖరికి ఉల్లిచేసిన మేలుకంటే కీడే ఎక్కువైందని వారంతా వాపోతున్నారు.



ఉల్లిని అమ్మకానికి సిద్ధం చేస్తున్న రైతులు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

పుస్తక నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి- మందస

మండలంలోని స్వయంశక్తి సంఘాల సభ్యులకు పుస్తక నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నట్లు వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక రాంపురం పంచాయతీలోని రాణీరుద్రమ గ్రామ సంఘం పరిధిలో బిడిమిలో మహిళా సంఘాల పుస్తక నిర్వహరణను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంఘ సభ్యులూ సంఘం స్థాపించిన నుంచి దాచుకున్న పొదుపులు ఎంత? ప్రభుత్వం ద్వారా వచ్చిన రివాల్వింగ్ ఫండ్, మ్యాచింగ్ గ్రాంట్లు ఎంత వచ్చింది? ప్రభుత్వం ద్వారా వచ్చిన వడ్డీ రాయితీలు, వివిధ పథకాల ద్వారా సంఘానికి ప్రభుత్వం ఎంత లబ్ధిచేకూర్చింది? ఇంటర్నల్ లెండింగ్ ద్వారా సంఘానికి ఇప్పటి వరకు వచ్చిన వడ్డీలు ఎంత? బ్యాంకు ఖాతాలో ఉన్న నిల్వ ఎంత? సంఘ సభ్యులపై ఉన్న అప్పు నిల్వలు తదితర విషయాలు క్షుణ్ణంగా పుస్తకాల్లో నమోదు చేయాలన్నారు. కమ్యూనిటీ ఆడిటర్లతో ప్రతిఒక్క సంఘమూ ఆడిట్ చేయించుకోని నివేదిక పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు టి.సూర్యకాంతం, క్లస్టర్ కో-ఆర్డినేటర్ ముఖలింగం, విఒఎ శశిరేఖ పాల్గొన్నారు.

27 నుంచి ఏలూరులో స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఏలూరులో ఉన్న సాయి ట్రైనింగ్ స్కూల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో చేరేందుకు వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపికలు ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె. శ్రీధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 18ఏళ్ల మధ్య వయసు గల వెయిట్ లిఫ్టింగ్ బాలికలు, పురుషులు, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు జరగనున్నట్లు తెలిపారు. అర్హత పొందిన వారికి ఉచిత భోజనవసతి, చదవుకునేందుకు ఫీజులు, స్పోర్ట్స్ కిట్లు, ఇన్సూరెన్స్ స్పోర్ట్స్ అథారటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం చెల్లిస్తారని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్, జనన ధ్రువీకరణ, స్పోర్ట్స్ అచీవ్‌మెంటు, ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పొందిన ఫిట్‌నెస్, స్టడీ, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లుతో పాటు పర్సనల్ ట్రైనింగ్ కిట్స్, నాలుగు పాస్‌ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు ఏలూరులోని సాయి ట్రైనింగ్ సెంటర్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న బోధనోపకరణ ప్రదర్శనలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యార్థులు ఇంగ్లీషు భాషపై ఆసక్తి ఉంటే సులువుగా నేర్చుకోవచ్చునని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటరావు అన్నారు. లాంగ్వేజ్ ఫెస్టివల్‌లో భాగంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రాజెక్టులను బుధవారం ప్రదర్శించారు. వ్యాసరచన, వకృత్వ మంచి చేతి రాత, స్పెల్ బీ పై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. 80 మంది విద్యార్థులు తయారు చేసిన ఇంగ్లీష్ పదజాలం గ్రామరు సంబంధించిన అంశాలు ఆకట్టుకున్నాయి. ఇంగ్లీషు ఉపాధ్యాయులు ఎల్.వి.చలం, టి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.శ్రీరాములు, కె.గోపాలకృష్ణ, ఆదినారాయణ, రామారావు, యతిరాజ్, గణేష్‌కుమార్, బాలరాజు, అర్జున్, బుడ్డు పాల్గొన్నారు.

మాతృభాషా శాస్త్రవేత్తల మహాసభలకు జంధ్యాల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగు రాష్ట్రాల మాతృభాషా శాస్త్రవేత్తల మహాసభల్లో వక్తగా పాల్గొనేందుకు సీనియర్ పాత్రికేయులు జంధ్యాల శరత్‌బాబుకు అవకాశం దక్కింది. మార్చి 25న హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు ఈ మహాసభలు జరగనున్నాయి. నిఘంటువులు పద పట్టిక రూప నిర్మాణం అన్న అంశంపై ఆయన మాట్లాడనున్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో జరగనున్న ఈ మహాసభలకు యూనివర్సిటీ అధికారులు ఆహ్వానం పంపించారు.

అందుబాటులో ఆయుర్వేదం మందులు



కొత్తూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక విభాగంలో రోగులకు అందుబాటులో ఆయుర్వేద మందులు ఉచితంగా ఉన్నాయని ఆయుర్వేదిక్ వైద్యులు ఎస్.చైతన్య అన్నారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కీళ్ల నొప్పులు, తలనొప్పి, నడుము నొప్పి, బిపి, సుగర్, దగ్గు, జలుబు, గ్యాస్ట్రిక్ వంటి వ్యాధులకు మందులు ఉన్నాయని అన్నారు. రోగులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటాయన్నారు.

సాయికుమార్ పరామర్శ

లావేరు : మండలంలోని గోవిందపురం పంచాయతీ లుకలాపు పేటకు చెందిన వైసిపి నాయకుడు ఎందవ శ్రీనువాసరావును రణస్థలం ఎంపిపి ప్రతినిధి, ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్ బుధవారం పరామర్శించారు. ఇటీవల శ్రీనువాసరావు తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న సాయికుమార్ పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి నాయకులు ఉన్నారు.

14 నుంచి పాల పోటీలు

ప్రజాశక్తి- రణస్థలం



దుర్గారావు, ఏడీ

ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానాన్ని వినియోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ పాల ఉత్పత్తి సాధించి పశు పోషణ లాభసాటిగా మార్చాలని, ఔత్సాహిక నిరుద్యోగ యువతను పాడి పరిశ్రమ వైపు ఆకర్షించాలని, పాడి రైతుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంచాలనే ఉద్దేశంతో పాల పోటీలు నిర్వహించాలని పశు సంవర్ధక శాఖ, బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ (బిఎంసి) తీర్మానించాయని రణస్థలం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు బుడుమూరు దుర్గారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాల పోటీల కార్యక్రమం మార్చి 14 నుంచి 16 వరకు విజయనగరంలోని తోటపాలెంలోని కె. వైకుంఠరావు డెయిరీ ఫామ్‌లో నిర్వహించబడునని, ఉత్తరాంధ్ర పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. పాల పోటీల్లో పాటించాల్సిన నియమ నిబంధనలు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే వారు ధరఖాస్తుతో పాటు పాస్‌ఫోటో, ఆధార్ కాపీ జతచేయాన్నారు. ఈ పోటీల్లో అత్యధిక పాలు ఇచ్చిన పశువులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వబడతాయన్నారు. పోటీల్లో పాల్గొనే రైతులు మార్చి 14న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కె.వైకుంఠరావు డెయిరీ ఫామ్‌కి తీసుకొనివచ్చి నిర్దేశించిన అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని, పోటీలు 14వ తేదీ సాయంత్రం పాల దిగుబడి పరీక్షతో మొదలై 16వ తేదీ ఉదయం పాలు దిగుబడి పరీక్షతో పూర్తవుతుందని తెలిపారు. 16న సాయంత్రం 4 గంటల నుంచి బహుమతి ప్రధానం శిబిరం ముగింపు కార్యక్రమంలో జరుగుతుందని పేర్కొన్నారు. 15, 16 తేదీల్లో లాభసాటి పశుపోషణ, ఆరోగ్యం, పునరుత్పత్తి, మేలైన యాజమాన్యంపై ఉదయం పది గంటల నుంచి ఒంటిగంట వరకు రైతులకు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ముఖ్యంగా పాలపోటీల్లో పాల్గొనే రైతులు, పశువులు ఉత్తరాంధ్ర జిల్లాలు (అనకాపల్లి, అల్లూరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం)లో నివసిస్తున్న వారై ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలో పశువైద్యాధికారిని గాని, గ్రామ సచివాలయంలోగాని సంప్రదించాలని కోరారు.

రైతు ఐడి నంబరు నమోదుకు పాట్లు

ప్రజాశక్తి- మందస



నమోదు చేయించుకుంటున్న రైతులు

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం ఈ నెల ఆఖరితో సమయం ఉండటంతో రైతులు రైతు సేవా కేంద్రాల చుట్టూ పడిగాపులు కాస్తున్నారు. రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు వివరాలను నమోదు చేసిన తరువాత ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించనున్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చిన పథకాలు పొందాలంటే ఈ గుర్తింపు సంఖ్య అనేది తప్పనిసరి. అయితే మారుమూల, గిరిజన గ్రామాల్లో నెట్‌వర్క్ అందకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఐడి కోసం నమోదు చేస్తున్న సమయంలో రైతు సెల్ నంబరుకు ఐదు మెసైజ్ వస్తాయి. అందులో వచ్చిన ఓటిపిలను నమోదు చేస్తేనే ఐడి నంబరు వస్తుంది. నెట్‌వర్క్ సక్రమంగా లేకపోవడంతో మెసైజ్‌లు రావడం లేదు. దీంతో అటు రైతులు, ఇటు ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. కొందరి రైతులకు ఆధార్‌కు ఫోన్ లింక్ కావడం లేదు. దీనిపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఎఒ శంకర్ దాస్‌ను వివరణ కోరగా, ఈ నెల 25 వరకు సమయం ఉందని, దీనిపై సిబ్బందికి పలు సూచనలు చేశామని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారుల నుంచి సంక్షేమ పథకాల దరఖాస్తులు స్వీకరించబడునని టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పట్టణంలోని వరద వారి క్వార్టర్స్‌లో ఉన్న ఎమ్మెల్యే కూన రవికుమార్ కార్యాలయంలో ప్రతిరోజు దరఖాస్తులు స్వీకరించబడునన్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛను, ఇంటి స్థలం, గృహ నిర్మాణ రుణాలు, కొత్త రేషన్ కార్డులు కోసం లబ్ధిదారులు దరఖాస్తులను టిడిపి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ మురళీమోహన్

తాళ్లవలసలో పూడికతీతలు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని తాళ్లవలస పంచాయతీలో వీధి కాలువల్లోని పూడికతీత పనులు బుధవారం మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్ ఆధ్వర్యంలో జరిగాయి. గ్రామంలోని వీధుల్లోని రహదారులపైన చెత్త తొలగింపు, కాలువల్లో పేరుకుపోయిన పూడికలను కూలీలతో తీయించారు. అనంతరం వీధుల్లోని కుళాయిలు వద్ద చేతి పంపులు వద్ద శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయకుమారి, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సిసి కెమెరాల ఏర్పాటు

టెక్కలి : పట్టణంలోని పలు వసతిగృహాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక బాలికోన్నత పాఠశాల ఎదురుగా ఉన్న సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యాన బాలికల వసతిగృహం వద్ద బుధవారం ఏర్పాటు చేశారు. గృహం ముందు లోపల, బాలికలకు రక్షణ దృష్ట్యా వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నాలుగు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 33/11 కెవి ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని బిఆర్ నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగించుట కారణంగా ఈ నెల 21న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కృషి విజ్ఞాన కేంద్రం, బిఆర్ నగర్, రైల్వేస్టేషన్, మెయిన్ రోడ్డు, తహశీల్దార్ కార్యాలయం, ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపం, వరద వారి క్వార్టర్స్, లక్ష్మీనగర్ వీధి తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.



ఫైల్స్‌తో విద్యార్థులు

పూర్వ విద్యార్థుల వితరణ

నందిగాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు వితరణ అందజేశారు. ప్రస్తుతం చదువుతున్న 66 మంది పదో తరగతి విద్యార్థులకు జిప ఫైల్ విత్ ఫోల్డర్లు, స్కూల్ బీరువా బుదవారం అందజేశారు. కార్యక్రమంలో శాంతికుమార్, జె.జయరాం, భుజంగరావు, దుర్యోధనరావు, మధు, లోకనాథం, మోహన్, శ్రీను, లక్ష్మీనారాయణ, కళావతి, శ్రీదేవి పాల్గొన్నారు.



జడూరు వద్ద అవస్థలు పడుతున్న వాహనదారులు

ఇరుకు రోడ్లతో అవస్థలు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో జాతీయ రహదారికి ఆణించి ఉన్న జడూరు నుంచి పిరువాడ, వైబివలస, కొండకొత్తపేట, గాతలవలస గ్రామాలు మీదుగా వచ్చి సుసరాం కూడలి వద్దకి చేరిన బిటి ఇరుగ్గా ఉంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా కోటబొమ్మాళి మండలం నుంచి పోలాకి మండలంలోని 20 గ్రామాలకు చెందిన ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు వెడల్పు తక్కువ ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చినవి పక్కకి వెళ్లేందుకు స్థలం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో పలు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. ఈ రహదారిపైన జడూరు, చిన్నజడూరు, పాతజడురు, పిరువాడ, రాల్ల గోదయవలస, వై.బి.వలస, కొండకొత్తపేట, గాతలవలస, కమ్మరపేట, వీరయ్యపేట, దువ్వవలస, చింతువానిపేట తదితర గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. ఇంత ప్రాధాన్యత ఉన్న రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విజేతలకు జ్ఞాపికలు

ప్రజాశక్తి- కొత్తూరు

ఇటీవల సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం నిర్వహించిన మండల స్థాయి గణిత పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాతపొన్నుటూరు ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుర్రాల కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన గణితశాస్త్ర క్విజ్ పోటీల్లో తమ పాఠశాల ఆరు, ఏడు తరగతి విద్యార్థులు బలగ వెన్నెల, రేగేటి రోహిత్ కుమార్, సవిరగాన షర్మిళ, బుద్దల దీపక్ లు పాల్గొని కన్సోలేషన్ విజేతలుగా నిలిచారన్నారు. ఈ గణితశాస్త్ర క్విజ్ కోసం ప్రశ్నావళిని సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు దండు ప్రకాశరావు, ఎల్.గోవర్ధనరావు, గేదెల వెంకట భాస్కరరావు, బూరాడ గణేష్, మీనాకుమారి, రామచంద్రరావు, పడాల సునీల్ తదితరులు రూపొందించి నిర్వహించారని, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంధవరపు రాజేష్, బూడిద సంతోష్‌కుమార్, పైసక్కి చంద్రశేఖరం, యిసై సౌజన్యవతి, బొమ్మాళి నాగేశ్వరరావు, కుదమ తిరుమలరావులు పాల్గొన్నారు.



జ్ఞాపికలను అందజేస్తున్న హెచ్ఎం కృష్ణారావు



క్రీడాకారులతో వెంకటరమణ

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

ఈ నెల 21 నుంచి 25 వరకు తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అంతర జిల్లాల టెన్నికాయిట్ జట్లు ఎంపికై పోటీల్లో పాల్గొనందుకు క్రీడాకారులు బయలుదేరారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు నర్తు వెంకటరమణ బుధవారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సంతోష్‌కుమార్, సుడియా వెంకటజోగారావు, కోశాధికారి పి.తవిటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. సిహెచ్.తారకేశ్వరరావు, కె.గోవిందరావు, పి.జగదీష్ బెహరా, ఎం.మణికంఠ, ఎన్.దివ్య, డి.రమ్య, పి.కావ్యశ్రీ, టి.భావనలు వెళ్లిన వారిలో ఉన్నారు. వీరికి కోచ్, మేనేజర్లుగా ఎం.దామోదర్, ఎల్.దిలీప్‌కుమార్, బి.మహేష్ వ్యవహరిస్తారు.

ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తోడ్పాటు

ప్రజాశక్తి- కవిటి

చదువులో చురుకుగా ఉండి తల్లి, తండ్రిని కోల్పోయి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తోడ్పాటు అందించడమే తమ లక్ష్యమని విద్యా వికాస్ కో-ఆర్డినేటర్ బొర్ర ప్రకాష్ తెలిపారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నెయ్యల హాసిని, బి.మణికంఠ, ఎం.శ్రీదీప్, ఎం.హరిచందనలకు ఒక్కొక్కరికి రూ.7 వేలు చొప్పున విద్యా వికాస్ స్కాలర్ షిప్‌లను సర్పంచ్ పూడి లక్ష్మణరావు బుధవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదుద్దేశంతో విద్యావికాస్ చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ టి.మోహనరావు, విద్యా వికాస్ కో-ఆర్డినేటర్ దేవేంద్రరౌలో, సభ్యులు నొడియా దుదిస్టి, పార్నంది నాగేశ్వరరావు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అకడమిక్ డైరెక్టర్ నాయుడు

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అరసవల్లి

నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మార్చి 8న బిఎస్‌సి ఆధ్వర్యంలో జరగబోయే కంప్యూటర్ సైన్స్ ఫెస్ట్ ఆక్సీ 2025కు సంబంధించిన పోస్టర్‌ను ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా బి.ఇ.వి.ఎల్ నాయుడు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యతో పాటు విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికితీసే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులందరూ ఈ ఫెస్ట్‌లో నిర్వహించే వివిధ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ రామకృష్ణ రెడ్డి, కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, కంప్యూటర్ విభాగాధిపతి ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఒ తిరుమలరావు

ఆధార్ కేంద్రం పరిశీలన

కంచిలి : మండలంలోని ఎం.ఎస్.పల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక నమోదు కేంద్రాన్ని ఎంపిడిఒ తిరుమలరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 వరకు మండలంలోని ఎం.ఎస్.పల్లి, పల్లికొల్లూరు, కంచిలి, డి.జి.పురం, పోలేరు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరేళ్ల లోపు వారు ఆధార్ కార్డుకు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే 15 ఏళ్లపైబడిన వారు ఆధార్ కార్డులో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి గురుమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న ఎఒ నరసింహమూర్తి

చివరి గింజ వరకూ కొనుగోలు

ప్రజాశక్తి- సోంపేట

రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో సేకరిస్తామని ఎఒ నర్సహమూర్తి అన్నారు. మండలంలోని బెంకిలి, బారువాపేట తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రెండు రోజుల్లో పదిమంది రైతుల నుంచి 200 క్వింటాళ్ల ధాన్యం సేకరించామన్నారు. ఫిబ్రవరి 11 నాటికి 19 వేల బస్తాల ధాన్యం సేకరణ చేయాల్సి, ఉండగా ఇప్పటికే నాలుగు వేల బస్తాలను సేకరించామన్నారు. మిగిలిన ధాన్యాన్ని సైతం త్వరగా సేకరిస్తామన్నారు. అవసరమైతే టెక్కలి, మెలియాపుట్టి మిల్లులకు ధాన్యం పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

దేవేంద్రరెడ్డికి సన్మానం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో డాక్టర్ దేవేంద్రరెడ్డి విశిష్ట సేవలు అందించేందుకు ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి సిబ్బంది బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు అనుష, శిల్ప, హెడ్ నర్సులు పాల్గొన్నారు.

నూతన పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ జి.నాగేశ్వరరావు 'హెల్త్ కేర్ సెంటర్స్ అండ్ ఇమేజ్ ప్రొసెసింగ్' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తన ఛాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యా రంగంలో రోజురోజుకూ వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఆవస్యకతను దృష్టిలో ఉంచుకొని రచయిత ఈ పుస్తకాన్ని రాశారని అన్నారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఐడి డాక్టర్ బాలక రమేష్‌నాయుడు అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు